మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



# విద్యా ప్రమాణాలు పెంచాలి...

**- డీఈఓ గోవిందరాజులు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 08 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించే లక్ష్యంతో ఉపాధ్యాయులు కృషి చేయాలని నాగర్‌కర్నూల్ డీఈఓ గోవిందరాజులు అన్నారు. గురువారం ఊర్కొండ, వంగూరు, ఉప్పునుంతల, అచ్చంపేట మండలాల్లోని పలు ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలను డీఈఓ గోవిందరాజులు అకస్మిక తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల గ్రేడింగ్‌ను, నోట్ పుస్తకాలను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. గణితం, ఆంగ్లం, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచే సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నవంబర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి విద్యా ప్రమాణాల స్థాయి పరిశీలించే పరీక్షల నాటికి విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సూచించారు. పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రధానోపాధ్యాయులు చూడాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెను ప్రకారం రుచికరమైన పరిశుభ్రత వాతావరణంలో విద్యార్థులకు అందజేయాలని సూచించారు. కేజీబీవీలలో పరిశుభ్రత వాతావరణంలో విద్యార్థుల భోజనాన్ని అందించాలన్నారు. వంట గది సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు అందించే కూరగాయలు, చికెన్, గుడ్లు, తాజాగా ఉండేలా చూసుకోవాలని ప్రత్యేకాధికారులకు సూచించారు. కేజీబీవీలలో బాలికల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఈఓ ఆదేశించారు.



విద్యార్థులతో మాట్లాడి విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకుంటున్న డీఈఓ

# విద్యార్థి దశనే భవిష్యత్ మార్గాలకు పునాది:ఎమ్మెల్యే

**తల్లిదండ్రులను గురువులను భక్తి శ్రద్ధలతో గౌరవించాలి**



పూల బొకేతో ఎమ్మెల్యే స్వాగతం పలుకుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల సిబ్బంది

**గోపాల్‌పేట ఆగష్టు 8 ప్రభాతవార్త :** గోపాల్‌పేట మండలం బుద్దారం గండిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను గురువారం రోజు ఎమ్మెల్యే సందర్శించారు, ఈ సందర్భంగా పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యేను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు డ్రమ్స్ మోగిస్తూ పూల బొకేతో శాలువాలు కప్పి ఘనంగా స్వాగతించారు, పాఠశాల ఉపాధ్యాయునిలతో మాట్లాడిన ఆయన పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని వారికీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన విద్యార్థులతో సరదాగా కాసేపు గడిపారు. ప్రతి ఒక్కరికి విద్యార్థి దశ ఎంతో కీలకమని విద్యార్థి దశలో అలవర్చుకున్న క్రమశిక్షణ భవిష్యత్ మార్గాలను సుగమనం చేస్తుందని ఆయన పేర్కొన్నారు, బుద్ధారం గండిలోని గురుకుల పాఠశాల సమీపంలోనే నియోజకవర్గస్థాయి ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ నిర్మాణం చేపడుతున్నామని బుద్ధారం గండి ప్రాంతం మొత్తం విద్యానిలయాలకు స్థావరంగా మారబోతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు రండి

**తెలంగాణ ఐజీ రమేశ్‌రెడ్డిని కోరిన నాయకులు**

**జడ్చర్ల, ఆగస్టు 8, ప్రభాతవార్త :** జడ్చర్ల మండల పరిధిలోని గంగాపూర్ ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని లక్ష్మీచెన్నకేశవస్వామిని దర్శించుకోవాలని కోరుతూ తెలంగాణ ఐజీ రమేశ్‌రెడ్డిని కోరారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లో ఐజీని కలిసి బొకే అందజేసి సన్మానించారు. ఇండియన్ రెడ్ క్రాస్ ఓవర్సీస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి,హుస్నాబాద్ రాంరెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, మాదేశ్‌రెడ్డి,రాజశేఖర్‌రెడ్డి, ,పీఏ రవిశంకర్ పాల్గొన్నారు.



ఐజీకి బొకే అందజేసి సన్మానిస్తున్న దృశ్యం



# నిండుకుండల్లా ప్రాజెక్టులు

- కర్ణాటకలో భారీ వర్షాలతో కృష్ణమ్మ ఉగ్రరూపం
- 100టీఎంసీలతో ఆల్మట్టి ప్రాజెక్టు
- జూరాల నుంచి 45గేట్లు ఎత్తి దిగువకు..
- జూరాల, శ్రీశైలం జలాశయాల్లో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 8, ప్రభాతవార్త :** కృష్ణా పరివాహక ప్రాంతంలో జలకళను సంతరించుకున్నది. వరద ఏమాత్రం తగ్గుముఖం పట్టకపోవడంతో కర్ణాటక ఎగువన ప్రాంతంలో కురుస్తున్న వర్షం కారణంగా ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. ఎగున నుంచి జూరాల డ్యాంకు నిరంతరంగా వరద కొనసాగుతున్నది. గురువారం జూరాలకు 3,15,000 క్యూసెక్కుల వరద చేరగా 45గేట్లు ఎత్తి స్పిల్ వే ద్వారా 3,13,065క్యూసెక్కులు, పవర్ హౌజ్ ద్వారా 19వేల774క్యూసెక్కులు దిగువకు వదిలారు. జూరాలలో పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 8.531టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఎగువ, దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాల్లోని విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. జూరాల ఎడమ కాలువకు 820క్యూసెక్కులు, కుడి కాలువకు 697, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100, నెట్టెంపాడుకు 750, కోయిల్‌సాగర్‌కు 315క్యూసెక్కులు విడుదల చేశారు. జూరాల నుంచి మొత్తంగా 3,35,488 క్యూసెక్కులు అవట్‌ఫ్లో నమోదైంది.

కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు జలకళ సంతరించుకున్నది. గురువారం ఉదయం 7గంటల సమాచారం మేరకు ఆల్మట్టి డ్యాంకు 2,01,941క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా 2,00,000 వేల క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదు అయింది. ప్రాజెక్టు నీట్టిమట్టం 519.60మీటర్లు,123.081 టీఎంసీలు కాగా ప్రస్తుతం 518.22మీటర్లు, 100.933టీఎంసీల నీట్టిమట్టం ఉన్నది. నారాయణపూర్‌కు 2,00,000 క్యూసెక్కుల వరద వస్తుండడంతో 25గేట్ల ద్వారా 2,00,490క్యూసెక్కులు దిగువకు వదులుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు నీటిమట్టం 492.25మీ. 33.313టీఎంసీలు కాగా ప్రస్తుతం 490.87మీటర్లు, 27.330టీఎంసీల నీట్టిమట్టం ఉన్నది.

**శ్రీశైలంటు సాగర్..**

శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద చేరుతుండడంతో సాగర్‌కు నీటి విడుదల కొనసాగుతున్నది. గురువారం మధ్యాహ్నం 12గంటల సమాచారం మేరకు జూరాల స్పిల్ వే ద్వారా 2,65,404క్యూసెక్కులు, పవర్ హౌజ్ ద్వారా 21,113క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 40,311క్యూసెక్కులు శ్రీశైలానికి వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885అడుగులు, 215.807టీఎంసీలు కాగా ప్రస్తుతం 882.60అడుగులకు చేరగా 202.5056టీఎంసీలకు చేరింది. దీంతో ప్రాజెక్టు 10గేట్లను 12అడుగుల ఎత్తుకు తెరిచి నాగార్జున సాగర్‌కు నీటి విడుదల చేశారు. ఏపీ పవర్ హౌస్‌కు 26,826, తెలంగాణ పవర్‌హౌజ్‌కు 38,528క్యూసెక్కుల నీటి విడుదల చేయగా గేట్ల ద్వారా దిగువకు 3,54,761 క్యూసెక్కులు సాగర్‌కు విడుదల చేస్తున్నట్ల అధికారులు తెలిపారు. సుమారు రెండు వారాలకు పైగా ఎగువన కురుస్తున్న వర్షాలకు కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు జలకళ సంతరించుకోవడంతో ఆల్మట్టి, కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తున్నది.

# ఈ నెల 25 లోగా ప్రసాద్ స్కీం భవనం పనులు పూర్తి చేయాలి

## అధికారులకు కలెక్టర్ సంతోష్ ఆదేశాలు

**గద్వాల, ఆగష్టు 8 ప్రభాతవార్త:** ప్రసాద్ స్కీం భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి ఈనెల 25న దేవదాయ శాఖకు అందజేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ సంబంధిత టూరిజం శాఖ అధికారులకు ఆదేశించారు. గురువారం అలంపూర్ పట్టణంలోని జోగులాంబ దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మించిన ప్రసాద్ స్కీం భవనాన్ని జిల్లా కలెక్టర్ టూరిజం శాఖ, పురావస్తు శాఖ, రెవెన్యూ శాఖ మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ గ్రౌండ్ ఫ్లోర్‌లో గల 300 మందికి సరిపడే అన్నదాన సత్రాన్ని, వంటగది, స్త్రీలు, పురుషులు వేరువేరుగా వినియోగించుకునే విధంగా నిర్మించిన మరుగుదొడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. త్రాగునీరు మరియు వంటలు చేసేందుకు ఉపయోగించుకునే విధంగా మరుగుదొడ్లు మరియు ఇతర అవసరాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇతర నీటి అవసరాలకు అనువైన స్థలం పరిశీలిస్తే బోర్ వేసేందుకు నిధులు అందజేయడం జరుగుతుందని పట్టణంలోని మెయిన్ వాటర్‌పైప్ లైన్ నుండి నీరు తీసుకోవద్దని సూచించారు. భవనంలో అసంపూర్తిగా ఉన్న దుకాణాల సముదాయ పనులను పూర్తిచేసి టెండర్ ప్రక్రియ చేపట్టాలన్నారు. పుష్కర ఘాట్, దేవస్థానానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. పార్కింగ్ స్థలంలో అవసరమైన పనులను చేపట్టి టెండర్ ప్రక్రియ చేపట్టాలన్నారు. దేవాలయ పరిసరాలను శుభ్రపరిచి, వ్యర్థ వస్తువులను తొలగించి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సంతోష్



బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. ఈ సందర్భంగా దేవాలయ పరిసరాలతో పాటు ప్రసాద్ స్కీం భవనాన్ని, పుష్కర ఘాటు, పార్కింగ్ స్థలాలను కలెక్టర్ విస్తృతంగా పరిశీలించారు. పై అంతస్తులతో భక్తుల కోసం నిర్మిస్తున్న రూమ్‌ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విధాలుగా ఏర్పాట్లు చేసి వెంటనే గ్రౌండ్ ఫ్లోర్ అందజేయాలని, మిగతా పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాన్ని సంబంధిత అధికారులతో కలిసి విస్తృతంగా పరిశీలించారు. ఆలయంలో నిరుపయోగం ఉన్న వస్తువులను తొలగించి, పాతబడిన నిర్మాణాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ ప్రాజెక్టు ముఖ్య అధికారి అనంతరావు, కేంద్ర పురావస్తు శాఖ అసిస్టెంటు సూపర్డెంట్ డా.రోహిణి పాండే, తాహసిల్దార్ మంజుల, మున్సిపల్ కమిషనర్ సరస్వతి, దేవాదాయ శాఖ ఈవో పురేందర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం ఒక అరగంట

# పరిసరాల పరిశుభ్రతకు కేటాయించండి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి ప్రతినిధి ఆగష్టు 8 ప్రభాతవార్త :** జిల్లాలో దోమల నివారణ కొరకు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ప్రతి ఇంట్లో తమ పరిసరాల్లో నిలువ నీరు లేకుండా చూసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా కలెక్టర్ సూచించారు. స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా గురువారం ఆరోగ్య సంరక్షణ దినోత్సవంగా పాటిస్తూ స్థానిక మహిళా సమాఖ్య భవనంలో మహిళా సమాఖ్య సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నుండి ప్రారంభమైన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం రేపు డ్రైడే వరకు నడుస్తుందన్నారు. నిలువ నీటిలో



జిల్లా మహిళా సమైక్య సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా కారకులైన దోమలు గుడ్లు పెట్టీ వ్యాప్తి చెందుతాయని వాటిని నివారించదానికి పరిసరాల్లో నిలువ నీరు లేకుండా చూసుకోవడం ఒక్కటే మార్గమని తెలిపారు. అందువల్ల ప్రతి శుక్రవారం ప్రతి ఒక్కరూ డ్రైడే లో భాగస్వాములై నిలువ నీటిని శుభ్రం చేసుకునే విధంగా మహిళా సంఘాల సభ్యులు చొరవ తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రతి ఇంట్లో కనీసం ఒక మొక్క నాటి వాటిని సంరక్షించే విధంగా అవగాహన కల్పించాలి. తమ ఇళ్ళలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వాడకుండా అవగాహన కల్పించాలని, కూరగాయలకు ఇంటి నుంచి తీసుకువెళ్లడం, ప్లాస్టిక్ బాటిల్, గ్లాసులు వాడకపోవడం పై అవగాహన కల్పించాలన్నారు. శ్రమదానం ద్వారా తమ కాలని, వార్డుల్లో ఉండే ప్రభుత్వ భవనాల పరిసరాల్లో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మహిళా సంఘాలకు విశేష ప్రాముఖ్యత ఉందనీ దాదాపు లక్షల మంది మహిళలు మహిళా సంఘాల్లో ఉంటారు. అందువల్ల మహిళా సమాఖ్య సభ్యులు ప్రతి మహిళ సంఘం సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ దోమల వల్ల ప్రాణాంతక డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి ప్రాణాంతక అంటు వ్యాధులు ప్రబలుతాయని అన్నారు. ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిసి.ఈ.ఒ యాదయ్య, పి.డి.డి ఆర్డీఓ ఉమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి జయచంద్ర మోహన్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యమ్మ, డా.సాయినాథ్ రెడ్డి, మండలం నుండి ముగ్గురు చొప్పున మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రంగంలోకి కలెక్టర్..

- మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో క్షేత్ర స్థాయిలో పర్యటన
- పలు వార్డుల్లో అధికారులతో కలిసి సమస్యల గుర్తింపు
- డెంగీ, వైరల్ ఫీవర్ సర్వేలో పాల్గొన్న కలెక్టర్ విజయేంద్ర బోయి
- పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలంటూ ప్రజలకు సూచన

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 8, ప్రభాతవార్త :** అపరిశుభ్రత వల్లే దోమలు ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాన బారిన పడే అవకాశం ఉందని తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిత్యం చెత్తను వేరు చేసి సిబ్బందికి అప్పగించాలని కలెక్టర్ విజయేంద్ర బోయి సూచించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని కోయనగర్, బీక రెడ్డికాలని, అయోధ్యనగర్‌లో ఆమె పర్యటించారు. వైద్య,ఆరోగ్యశాఖ సిబ్బంది నిర్వహిస్తున్న జ్వర జర్వేను పర్యవేక్షించారు. వార్డుల్లో కలియ తిరిగారు. అపరిశుభ్రంగా వర్షపు నీరు నిల్వ ఉండడాన్ని గమనించి మున్సిపల్ అధికారులు , సిబ్బందిని వార్నింగ్ ఇచ్చారు. రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందునా ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. దోమలు వ్యాప్తిం చెందకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, అడిషనల్ డీఎంహెచ్‌వో, వైద్య సిబ్బది తదితరులు ఉన్నారు.



వార్డుల్లో పర్యటిస్తున్న కలెక్టర్,మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, అడిషనల్ డీఎంహెచ్‌వో

# ఆరుబయట పాఠాలు..

**శిథిలావస్థలో కారుకొండ ప్రభుత్వ పాఠశాల**

**బిజినేపల్లి,ఆగష్టు 08 ప్రభాతవార్త :** మండలంలోని కొరుకొండ గ్రామంలో ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం ఒకటవ తరగతి నుండి ఆరవ తరగతి వరకు ఈ పాఠశాలలో సుమారుగా 100 మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలకు ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో పూర్తిగా పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో తరచూ తరగతి గదుల్లో పైకప్పు పెచ్చులు ఊడి విద్యార్థులపై పడుతున్నాయి. చిన్నపాటి వర్షం పడితే చాలు వర్షం నీరంతా తరగతి గదుల్లోకి చేరి విద్యార్థుల పుస్తకాలు తడిసి

- మిగతా4లో..



శిథిలావస్థకు చేరిన కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాల

## నేటి నుండి వాసవిమాత వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు

### సుభ్రపాత సేవతో ఉత్సవాలకు శ్రీకారం



**దేవరకద్ర,ఆగస్టు 08 ప్రభాతవార్త:** దేవరకద్రలో కొలువు దీరిన ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి 8వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుండి అంగరంగా వైభవంగా ప్రారంభకానున్నాయి. ప్రతి ఏడాది అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు నిర్వహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 11న ఈ బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఈ సందర్బంగా ఉత్సవాలలోని మొదటిరోజు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి సన్నిదిలో భహ్మముహూర్తంలో అమ్మవారి బ్రహ్మశ్రీ అలయ ప్రధాన అర్చకులు తరిమల హరిశంకరశర్మ అధ్వర్యంలో సుభ్రపాత సేవతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి. అలాగే అదేరోజు గణపతి పూజా ధ్వజారోహణం, పుణ్యాహవచనం, నవగ్రహ మంటపారాధన, ప్రధాన దేవతఅవహావనం, మహామంగళహారతి, తీర్థప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. విశేష ఉత్సవాల సందర్బంగా అమ్మవారిని రకరకాల పూలతో పాటు వివిధ బంగారు ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తారు. కావున అమ్మవారి ఈ భ్రహోత్సవాలలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాతృలు కావాలని దేవస్థానం చైర్మెన్ కల్వకన్నయ్యశెట్టి, మహిళా సంఘ అధ్యక్షురాలు గుద్దేటి మంజుల రాణిలు కోరారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



**బిజినేపల్లి,ఆగష్టు 08 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిబ్బంది అందరిని పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఒక్కరోజు సమ్మె కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వమే కార్మికుల వేతనాలకు ప్రత్యేక గ్రాండ్ కేటాయించాలని పిఆర్సీలో అర్హులుగా గుర్తించాలని ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. సహజ మరణానికి ఐదు లక్షలు ఇవ్వాలని గ్రామ పంచాయతీ సిబ్బంది పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద భీమా గ్రాడ్యుటీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. అనంతరం ఎంపిడిఓ కథలప్పకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు గొర్లస్వామి, మైబుస్, మల్లేష్, జయ్వంత్, రవి, రాము, సుభాష్, నరసింహ, రాములు, జంపు మంగమ్మ, సుజాత, చెన్నమ్మ పాల్గొన్నారు.

## భూత్పూర్ మున్సిపాలిటీని సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్..!!



**భూత్పూర్,ఆగష్టు 8,ప్రభాతవార్త :** జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ గురువారం భూత్పూర్ మున్సిపాలిటీని ఆకస్మికంగా సందర్శించి స్వచ్ఛదనం,,పచ్చదనం నిర్వహణపై కమిషనర్ సురేందర్‌రెడ్డితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పదివార్డులలో పచ్చదనం.. స్వచ్ఛదనం,,పరిశుభ్రతా చర్యలపై తీసుకుంటున్న చర్యలు, వాటి అమలుపై కమిషనర్ సురేందర్‌రెడ్డిని అడిగి రికార్డులను పరిశీలించారు. తడిచెత్త, పొడిచెత్త, డంపింగ్‌లపై కూడా జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సురేందర్‌రెడ్డితో పాటు మేనేజర్ శంకర్, ఈఈ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## చేవేళ్ల ఎస్సీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ ఎస్సీమోర్చా డిమాండ్..!!

### భూత్పూర్ ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేత



**భూత్పూర్,ఆగష్టు 8,ప్రభాతవార్త :** ఎన్నికల ముందు కాంగ్రెస్ చేవేళ్లలో చేసిన ఎస్సీ డిక్లరేషన్ హామీలను ఇంతవరకు నెరవేర్చలేదని పేర్కొంటూ బీజేపీ ఎస్సీ మోర్చా భూత్పూర్ మండల శాఖ అధ్యక్షుడు మ్యాతరి రాము ఆధ్వర్యంలో దళితులు గురువారం భూత్పూర్ చౌరస్తా నుంచి స్థానిక తహసిల్దార్ కార్యాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి తహసిల్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మ్యాతరి రాము మాట్లాడుతూ అంబేద్కర్ అభయ హస్తం పేరిట దళితులకు రు.12లక్షలు, బడ్జెట్‌లో దళితులకు రు.వెయ్యి కోట్లు కేటాయించకపోవడం, దళితులకు శాశ్వత ఇళ్ల నిర్మాణాలకు రు.ఐదు లక్షలు బడ్జెట్‌లో కేటాయించకపోవడం, ఎస్సీ సంక్షేమ హాస్టళ్ల పునర్నిర్మాణాలకు నిధులు కేటాయించకపోవడం, ఎస్సీ ఉప కులాలైన మాల, మాదిగ కార్పొరేషన్లకు ఏడాదికి రు.750కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని చెప్పి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోగా, ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని రాము ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నేత సుదర్శన్‌రెడ్డి, జిల్లా నేత ఎండి ఫారూఖ్, పార్టీ భూత్పూర్ పట్టణ అధ్యక్షుడు రవితో పాటు నాయకులు పట్నం శ్రీశైలం, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

## స్వచ్ఛదనం పచ్చదనం విజయవంతం చేయాలి



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్యేక అధికారి

**బిజినపల్లి,ఆగష్టు 08 ప్రభాతవార్త :** పల్లెల్లో పరిశుభ్రతను, పచ్చదనాన్ని పెంచేలా, స్వచ్ఛదనం పచ్చదనం అనే ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మండల ప్రత్యేక అధికారి రమాదేవి తెలిపారు. నంది వడ్డెమాన్ గ్రామంలో గురువారం నా గ్రామం నా గౌరవం అనే నినాదంతో పారిశుద్ధ్యం, అభివృద్ధి కార్యక్రమాలు, వనమహోత్సవం కార్యక్రమాలు నిర్వహించుకోవాలని రమాదేవి సూచించారు. పల్లెల రూపురేఖలు మార్చే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ఎంపిడిఓ కథలప్ప సూచించారు. పాఠశాలల్లో పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, దోమల నివారణ, తడి పొడి చెత్తపై, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి ప్లాంటేషన్ కింద కనీసం 6 మొక్కలు నాటించాలన్నారు. కుక్కల బెడదతో పాటు డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై ఎంఎం వెంకటమ్మ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం హనుమంతరెడ్డి, పంచాయతీ కార్యదర్శి లింగారెడ్డి, ఏపిఓ మల్లికార్జున్, ఈజిఎస్ సిబ్బంది దేవదాస్, అంగన్‌వాడి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తమొల్గర,కరివెనలలో స్వచ్ఛదనం పచ్చదనం..!!

**భూత్పూర్,ఆగష్టు 8,ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా ఈ నెల 5నుంచి 9వ వరకు ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా భూత్పూర్ మండలంలోని గ్రామాలు, భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంధితో కలిసి ప్రజాప్రతినిధులు స్వచ్ఛదనం పేరిట పరిశభ్రతా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీ, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు స్వచ్ఛదనంలో పాల్గొని పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మూడో రోజు బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ భూత్పూర్ పట్టణంలోని తొమ్మిదో వార్డు, మండలంలోని పోతులమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాల్గొరోజైన గురువారం భూత్పూర్ పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని కొత్తమొల్గర, కరివెన గ్రామాలలో మండల స్పెషలాఫీసర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎంపిఓ శ్రీదేవి మండల వైద్య అధికారులు, ఉద్యోగులు, సిబ్బంధితో కలిసి పచ్చదనం.. స్వచ్ఛదనం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్పెషలాఫీసర్ వేణుగోపాల్ కొత్తమొల్గర లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సంద ర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ పరిశుభ్రతను పాటించి అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో దోమలు, నీటి ద్వారా సంక్రమించే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి రోగాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ శ్రీదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్, డాక్టర్ యమున, సీహెచ్ఓ అయూబ్‌ఖాన్, హెల్త్ అసిస్టెంట్స్ శ్రీనివాస్, అరుణ, పీఎస్ మొగిలిరెడ్డితో పాటు ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కరివెనలో నిర్వహించిన కార్యక్రమంలో పరిశుభ్రత చర్యలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆహారపు అలవాట్లపై తగిన సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ శ్రీదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్, డాక్టర్ దిలిప్, సీహెచ్ఓ అయూబ్‌ఖాన్‌తో పాటు హెల్త్ అసిస్టెంట్స్ ప్రమోద్‌కుమార్, పుష్పలీల, పీఎస్ రాజేష్‌తో పాటు ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తమొల్గరలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మండల స్పెషలాఫీసర్ వేణుగోపాల్



కరివెనలో విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎ ప్రమోద్‌కుమార్

# స్వచ్ఛదనం పచ్చదనంతో సంపూర్ణ ఆరోగ్యం

### ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ పి. రాంరెడ్డి.. ఆరోగ్యం, పరిశుభ్రతపై లక్ష్మీపల్లిలో విద్యార్థులకు అవగాహన

**దేవరకద్ర,ఆగష్టు 08 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని దేవరకద్ర మండల ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ పి. రాంరెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం పర్యవేక్షణలో భాగంగా దేవరకద్ర మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావుతో కలిసి గురువారం లక్ష్మీపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరోగ్యం పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛదనం పచ్చదనం వనమహోత్సవం కార్యక్రమాలకు సంబంధించి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన నినాదాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం డిప్యూటి కలెక్టర్ రాంరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛదనం పచ్చదనంతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగూ మారుతారన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వ్యక్తిగత పరిభుభ్రతను విధిగా పాటించాలని సూచించారు. పరిసరాలను, పాఠశాలను, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి రోగాలు దరి చేరవని అన్నారు. ముఖ్యంగా ఇళ్ల ముందు మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అపరిశుభ్రత కారణాల వల్ల దోమలు, ఈగల బెడద ఎక్కువయి డెంగ్యూ, మలేరియా వ్యాధులతో పాటు అనేక అంటూ రోగాలు, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై దృష్టి సారించాలని కోరారు. ప్రధానంగా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కాగా లక్ష్మీపల్లి పాఠశాలలోని పచ్చదనం పరిశుభ్రతపై ప్రత్యేక అధికారి, డిప్యూటి కలెక్టర్ రాంరెడ్డి సంతృప్తి వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.



స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతున్న దృశ్యం

**పరిశుభ్రత...పచ్చదనం పెంచాలి**

**ఎంపిడిఓ శ్రీనివాస్‌రావు**

స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంచేందుకు ప్రజలందరు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పరిశుభ్రతలతో ప్రజల ఆరోగ్యాలు బాగుంటాయని అన్నారు. అనంతరం గ్రామాల్లో క్రీడా మైదానంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎపిఓ, పంచాయతీ కార్యదర్శి రాంచందర్, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయకర్త అశ్విని చంద్రశేఖర్, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు కె.శ్రీనివాస్, ఎంఎ బాసిద్, ఉపాధ్యాయులు అసఖాద్రి, శంకర్, ఎ.చంద్రశేఖర్, మదన్, కల్పన, విజయలక్ష్మి, లక్ష్మి, సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్ జగదీష్, అంగన్‌వాడి, ఆశ కార్యకర్తలు లక్ష్మి, పాండమ్మ, నందిని, పరమేశ్వరి, గ్రామస్తులు వెంకటేశ్వర్‌రెడ్డి, రాములు, సాయిలు, రమేష్, కొండన్న పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు స్వయం ఉపాధి శిక్షణకు ఆన్లైన్ దరఖాస్తులు

**గద్వాల ఆగష్టు 8 ప్రభాతవార్త :** గద్వాల్ జిల్లా నిరుద్యోగ యువతీ యువకులకు స్వయంఉపాధి శిక్షణ కోరకు ఆన్లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు బిసి స్టడీ సర్కిల్ కె. రాములు ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి శిక్షణ కోరకు బీసీ నిరుద్యోగ యువతి, యువకులు ఆన్లైన్ నందు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్ నందు మూడు నెలల ఉచిత శిక్షణ, నెలకు 4000/- రూపాయులు స్టైఫెండ్, స్టడీ మెటీరియల్, భోజన వసతి, టీషర్టు, బ్యాగ్, టూల్ కిట్, సిర్టిఫికెట్, జాబ్ ప్లేస్మెంట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎస్.ఎస్.సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా పాస్ అయ్యి, 18 నుండి 25 సంవత్సరాల వయసు గలవారు, కులం సిర్టిఫికెట్స్, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 5 లక్షల లోపు అర్హత గల వారై ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకొను అభ్యర్థులు వెబ్సైట్ నందు ఈనెల 8వ తేదీ నుండి 24 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలపారు. కోర్సుల వివరాలు రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, డిష్ వాషర్, ఎయిర్ కండిషనర్ రిపేర్, అన్నాలేషన్ గ్యాస్ చార్జింగ్, ఎల్‌టివి, ఓఎల్ఈడి మానిటర్, మైక్రోవేవ్ ఓవెన్, వాటర్ పూర్యిఫైర్, బేసిక్ హెచ్ఏ రిపేర్, ఇన్నాలేషన్. జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఇతర వివరములకు ఫోన్ నెంబర్ 08546-293022 సంప్రదించగలరని ఆయన తెలియజేశారు.

## భూత్పూర్‌లో టీజీఎస్ ఆర్టీసీ కార్గో..!!

### -సేవల్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్,ఎటీఎం ఇసాఖ్




భూత్పూర్‌లో టీజీఎస్ ఆర్టీసీ కార్గో సేవల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, ఆర్టీసీ ఏటీఎం ఇసాఖ్ తదితరులు

**భూత్పూర్,ఆగష్టు 8,ప్రభాతవార్త :** నాలుగేళ్ల క్రితం టీజీఎస్ ఆర్టీసీ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించిన కార్గో సేవల్ని భూత్పూర్ పట్టణ కేంద్రంలో టీజీఎస్ ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఇసాఖ్, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌లు ప్రారంభించారు. భూత్పూర్‌కు చెందిన సీనియర్ సిటీజన్ సత్తూర్ సత్తయ్యగౌడ్ నిర్వహిస్తున్న ఈ కార్గో సేవల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్‌తో పాటు పలు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఇసాఖ్ మాట్లాడుతూ రవాణాలో టీజీఎస్ ఆర్టీసీకి మించిన సంస్థలు లేవన్నారు. గడిచిన తొమ్మిది దశాబ్దాలుగా ఆర్టీసీ ప్రజలు, ప్రయాణికులకు ఎల్లవేళలా వినూత్న సేవలందిస్తున్న ఆర్టీసీకి ప్రజాదరణ తగ్గలేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ 2020 జూన్ 19న హైదరాబాద్‌లో ఈ కార్గో సేవల్ని ప్రారంభించిందని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలలో కార్గో సర్వీసులు విజయవంతంగా నడుస్తున్నాయని, సురక్షితంగాను, క్షేమంగాను ఆర్టీసీ కార్గో బస్సులు సరుకుల్ని తక్కువ ఫ్రయిట్ చార్జీలతో చేరవేస్తున్నాయని తెలిపారు. భూత్పూర్ పట్టణ కేంద్రం బెంగళూర్-హైదరాబాద్ జాతీయ రహదారి-44కి కూడలిగా ఉన్నందున వ్యాపారస్థులు, వర్తక దుకాణాదారులు దూర ప్రాంతాల నుంచి తమ సరుకుల్ని నమ్మకమైన టీజీఎస్ ఆర్టీసీ కార్గో సర్వీసుల్లోనే బుక్ చేసి లావాదేవీలు సాగించవచ్చని అన్నారు. ప్రారంభోత్సవ కార్యక్ర మానికి బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, మొహ్మద్ సాధిక్, గడ్డం ప్రేమ్ కుమార్, గడ్డం రాములు, ఆకుల వెంకటయ్య, సత్తూర్ సురేష్‌గౌడ్, మొహ్మద్ ఆహ్మద్, మొహ్మద్ షేక్ యాసిన్, మొహ్మద్ అబ్దుల్ హాఫీజ్, ఎండి ఫసియొద్దిన్, భీక్యానాయక్‌తో పాటు టీజీఎస్ ఆర్టీసీ కార్గో టీం లీడర్ పృధ్వీరాజ్, సేల్స్ ఆఫీసర్లు రాజ్‌కుమార్, శరత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 30లోగా సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలి...

### - ప్రతి మిల్లు నుంచి రోజుకు 2 ఏసీకేల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందించాలి

### - అదనపు కలెక్టర్ కె.సీతారామారావు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కె.సీతారామారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 08 ప్రభాతవార్త:** సెప్టెంబర్ 30 లోపు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) లక్ష్యాన్ని పూర్తి చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ కే.సీతారామారావు రైస్ మిల్లర్లకు ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో 2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ రైస్ డెలివరీపై అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లులకు సీఎంఆర్ క్రింద కేటాయించిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి బియ్యం నిల్వలు అందించేలా రైస్ మిల్లర్లు సహకరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన గడువు లోగా సెప్టెంబర్ 30లోగా సీఎంఆర్ డెలివరీ చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు రైస్ మిల్ రెండు ఏసీకెల బియ్యాన్ని అందజేయాలన్నారు. ఇట్టి విషయమై అత్యంత ప్రాధాన్యతనమిస్తూ రైస్ మిల్లుల వారీగా పూర్తి స్థాయి పర్యవేక్షణ చేయాలని అధికారులకు తెలిపారు. మిల్లర్లు పూర్తి స్థాయి సామర్థ్యం మేరకు మిల్లింగ్ జరపాలన్నారు. ఇంకా ఇవ్వాల్సిన సీఎంఆర్ మేరకు రోజు వారి ప్రణాళికతో మిల్లింగ్ జరిపి డెలివరీ చేయాలని మిల్లర్లకు సూచించారు. సీఎంఆర్ రైస్ డెలివరీ లక్ష్యాన్ని చేరుకోని మిల్లర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, నిర్ణీత సమయంలోగా అందజేయాలని, వారిపై 6ఏ కింద కేసులు బుక్ చేస్తామని, మిల్లును బ్లాక్ లిస్టులో పెట్టడంతో పాటు సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. 49048 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా 10730 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని నేటి వరకు అందించగా 38318 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ఇంకా రావాల్సి ఉందని తెలిపారు. ఇప్పటి వరకు 21.88 శాతం మాత్రమే సీఎంఆర్ పూర్తైందని, మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామికుమార్, డీఎం ఆసీఫ్ ఏయం రాజేందర్, జిల్లాలోని రైస్ మిల్లర్లు, డీటీఎస్లు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ హామీలను నెరవేర్చాలి



**జడ్చర్ల,ఆగష్టు 08 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జడ్చర్ల ఎంపిడిఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 10నెలలుగా పోరాడుతూనే ఉన్నామన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మేము అధికారంలోకి వస్తే మేనిఫెస్టోలో పెట్టి రూ. 18వేల చొప్పున ఇస్తామని, ఇంతవరకు అమలు కావడం లేదన్నారు. గ్రామ పంచాయతీల్లో కొన్ని నెలలుగా, వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వేతనాలు, వెంటనే విడుదల చేయాలని, ఇఎస్ఐ, ఐపిఎఫ్ సౌకర్యం కల్పించాలని ప్రమాద భీమా 10 లక్షలు ఇవ్వాలని తదితర డిమాండ్లు నెరవేర్చాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జంగయ్య, కృష్ణయ్య, సాయిలు, నాగయ్య, ఆశన్న పాల్గొన్నారు.

## 17.9 ఫీట్లకు చేరిన కోయిల్‌సాగర్‌లో నీటిమట్టం

**దేవరకద్ర,ఆగస్టు 08 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో నీటిమట్టం గురువారం 17.9 ఫీట్లకు చేరింది. జూరాల నుండి కృష్ణాజలాలను కోయిల్‌సాగర్ లోకి తరలింపు కొనసాగుతుంది. ప్రాజెక్టునుండి ఆయకట్టుకు నీటిసరఫరా నిలిపివేశారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు.

## మురుగు కాలువలను పరిశీలించిన ఎమ్మెల్యే



మురుగు కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్,ఆగష్టు 08 ప్రభాతవార్త :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకారణంగా పట్టణంలోని శబరీకాలనీ ఎల్లమ్మకుంటల ద్వారా వస్తున్న మురుగు కాలువనీరు అంబేద్కర్‌నగర్ కాలనీకి రావడంతో కాలనీ వాసులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతు న్నా ఇప్పటివరకు ఏ అధికారి స్పందించకపోవడంతో ఈ విషయాన్ని కాలనీ వాసులు స్థానిక ఎమ్మెల్యేకు తెలిపారు. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి మున్సిపాలిటీ కమిషనర్‌ను, సంబంధిత అధికారులతో కలిసి అంబేద్కర్ నగర్‌లో పర్యటించి మురుగునీటి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని, కొత్త కాలువ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఏటా కొద్దిపాటి వర్షాలు రావడంతో అంబేద్కర్ నగర్ వాసుల ఇళ్లలోకి మురుగు కాలువ నీళ్లు రావడం జరుగుతుంది. అలాగే ఇక్కడ ఉన్న కాలనీ వాసులకు మిషన్ భగీరథ నీరు అందలేదనే విషయాన్ని కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. దానిని కూడా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు.

## బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సంతాపం


బట్టాచార్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం

**మక్తల్,ఆగస్టు 08 ప్రభాతవార్త:** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్య మంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పట్ల గురువారం మక్తల్‌లో సిపిఎం ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఎం పార్టీ కోసం,పశ్చిమ బెంగాల్ అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి. వెంకట్రాంరెడ్డి, నాయకులు పి. ఆంజనేయులు,గోవిందరాజు, ఆంజనేయులు,భరత్‌కుమార్, వి.వెంకటయ్య, లక్ష్మణ్, ఎస్.ఆంజనేయులు,మంగలిసూర్యప్రకాష్,గజలప్ప,చంద్రాములు పాల్గొన్నారు.

## అన్నాసాగర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నేత జన్మదిన వేడుకలు


కలాల్ రాజా బాలచంద్రగౌడ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

**భూత్పూర్,ఆగష్టు 8, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ సీనియర్ నేత కలాల్ రాజా బాలచంద్రగౌడ్ జన్మదిన వేడుకలు గురువారం భూత్పూర్ మండలం అన్నా సాగర్‌లోని దేవరకద్ర నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి స్వగృహంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బాలచంద్రగౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శాలువలు,పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు మొహ్మద్ సాధిఖ్‌తో పాటు నాయకులు మొహ్మద్ షాకీర్,దుప్పల్లి మొహ్మద్ అర్షద్,వడ్డే అంజనేయులు, రాము తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు ఫోన్లు అప్పగింత


బాధితులకు ఫోన్ అప్పగిస్తున్న పట్టణ ఎస్సై జయన్న

**వనపర్తి టౌన్ ఆగష్టు 8 ప్రభాతవార్త:** వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొంతమంది బాధితులు సెల్ ఫోన్లు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయ్యగా దానిపై విచారణ చేపట్టారు. వనపర్తి టౌన్ ఎస్సై జయన్న రెడ్డి వివరాల ప్రకారం ఫోన్లు పోయినట్లు ఫిర్యాదారులు పోలీస్ స్టేషన్లో దరఖాస్తులు ఇవ్వడంతో, విచారణ చేపట్టిన ఫిర్యాదుదారుల సి.ఈ.ఐ.ఆర్ పోర్టల్ ద్వారా 2 ఫోన్లను రికవరీ చేయడం జరిగింది. ఎం విజయ్ కుమార్,శ్రీశైలం అనే బాధితులకు అందించారు,వనపర్తి టౌన్ ఎస్సై మాట్లాడుతూ వనపర్తి పట్టణంలో మొబైల్ షాపుల యజమానులు తెలియజేస్తున్నాం ఎవరైనా ఫోన్లను అమ్మినా గానీ కొన్న వారిపై కేసులు నమోదు చేస్తాం ఎవరైనా మీ దగ్గరికి వస్తే ఖచ్చితంగా అతని దగ్గర సరైన ఆధారాలు పరిశీలించిన తర్వాత కొను గోలు చేయాలి, మీకు ఎమైనా అనుమానాలు ఉంటే పోలీస్ వారికి సమా చారం ఇవ్వాలి అని తెలిపారు.ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేసిన ఫోన్లో మీద దృష్టి సారిస్తాం మిగతా బాధితుల ఫోన్లో కూడా త్వరలోనే రికవరీ అయ్యే విధంగా చూస్తాం అని తెలిపారు.

## పాన్‌గల్ ఎస్సైగా శ్రీనివాసులు



**పాన్‌గల్ ఆగష్టు 8 ప్రభాతవార్త:** మండల నూతన ఎస్సైగా కె శ్రీనివాసులు గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు ఇక్కడ పని చేస్తున్న కళ్యాణ్ రావు జిల్లా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయగా ఎస్పీ ఆఫీసు (డి సి ఆర్ బి) విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు ఇక్కడికి బదిలీపై వచ్చారు.దీంతో పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో శాంతి భద్ర తలను కాపాడేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాలప్రజలు ప్రతి ఒక్కరూ పోలీసులతో సహకరించాలని ఆయన కోరారు.

## ఘనంగా సీఎం సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి జన్మదినోత్సవం


సీఎం సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

**కల్వకుర్తి, ఆగస్టు08 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా గురువారం జూబ్లీహిల్స్‌లోని తిరుపతిరెడ్డి నివాసంలో వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, విద్యాకమిటీ చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్‌లు శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛంఅందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.జన్మదిన శుభాకాంక్షలు తెలిపినవారిలో నాయకులు సంజీవ్ కుమార్ యాదవ్, శిశుపాల్‌రెడ్డి, యెన్నం కృష్ణారెడ్డి, కలిమిచెర్ల రమేష్, జైపాల్ నాయక్, చిగుళ్లపల్లి శ్రీధర్, అలీ, గోపాల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

**మక్తల్‌టౌన్,ఆగష్టు08 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బికెఆర్ ఫౌండేషన్ అధినేత కాంగ్రెస్ నాయకులు గవినోళ్ల బాలకృష్ణారెడ్డి హైదారాబాద్‌లో తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

## 2వ రోజు కోర్టు విధుల బహిష్కరణ

**కల్వకుర్తి, ఆగస్టు 08 ప్రభాతవార్త:** జనగామలో న్యాయవాదులపై దాడులు చేసిన పోలీసులపై చర్యలు తీసుకునే వరకు నిరసనలు కొనసాగిస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.వెంకటరమణ అన్నారు. 2వ రోజు న్యాయవాదులు విధులు బహిష్కరించి ప్రధాన డిమాండ్లు దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, న్యాయవాదుల రక్షణకు న్యాయవాదుల రక్షణ యాక్ట్ ప్రవేశ పెట్టాలని, జనగామ పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్ఐలపై తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.నిరసన తెలిపిన వారిలో న్యాయవాదులు వెంకటేశ్వర్‌రావు,లక్ష్మినారాయణ, భాస్కర్‌రెడ్డి, జమీల్, నాగరాజు, జయంత్, రాంగోపాల్, మల్లేష్, శ్రీకాంత్, ప్రశాంత్, మల్లేష్, శేఖర్, శ్రీను ఉన్నారు.


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

# సంగంబండను పూర్తిస్థాయిలో నింపాలి

**■ మాజీ ఎంపిటిసి జి. బలరాంరెడ్డి**

**మక్తల్,ఆగస్టు 08 ప్రభాతవార్త:** రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకంలో భాగంగా మక్తల్ మండలంలోని సంగంబండ వద్ద నిర్మించిన సంగంబండ రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపిన తర్వాతనే, గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయాలని మాజీ ఎంపిటిసి జి. బలరాంరెడ్డి డిమాండ్ చేశారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 3.36 టీఎంసిలు ఉండగా, ప్రస్తుతం 2.6 టిఎంసిల నీటి నిల్వ మాత్రమే ఉందన్నారు. అయినప్పటికి అధికారులు నీటిని చెరువులకు వదలకుండా, గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు.ఇంకా దాదాపుగా ఒక టిఎంసి నీరు రిజర్వాయర్‌లో నింపే అవకాశం ఉందన్నారు. కర్ణాటకలోని చేలెడ్ గ్రామం రిజర్వాయర్ నీటితో మునకకు గురవుతున్నదని, ఆ గ్రామంలో దాదాపు 150 ఎకరాల భూములకు నష్టపరిహారం అందిస్తే సంగబండ రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నింపవచ్చన్నారు. అధికారుల ముందుచూపు లేకపోవడంతో కృష్ణానది నుంచి ఎంతో ప్రజాధనాన్ని వెచ్చించి రిజర్వాయర్‌లోకి నింపిన వరదనీటిని మళ్లీ కృష్ణానదిలోకి వదిలే పరిస్థితి నెలకొందన్నారు.అలా కాకుండామక్తల్, మాగనూరు మండలాల్లోని చెరువులకు సాగునీటిని విడుదల చేసి, చెరువు ఆయకట్టు భూములకు సాగులోకి తీసుకురావాలన్నారు.వేలాది ఎకరాల భూములకు సాగునీరు అందించకుండా నీటిని వృధాగా పోనివ్వడం సరికాదన్నారు.

# పరిశుభ్రతతోనే ఆరోగ్యం, ఆనందం

**జడ్చర్ల డిగ్రీ కళాశాలలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుకన్య**

**జడ్చర్ల,ఆగష్టు08 ప్రభాతవార్త:** మనచుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంతో పాటు ఆనందం కూడా వెల్లివిరుస్తుందని డా.బూర్గుల రామకృష్ణరావు ప్రభుత్వ డిగ్రీ, పిజి కళాశాల ప్రిన్సిపల్ సుకన్య అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని కళాశాల ఆవరణలో వృక్షశాస్త్ర విభాగం ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాలలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్ ఇటీవల వర్షాలకు పెరిగిన కలుపు, చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. మొక్కలకు పాదులు చేశారు. అలాగే మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా.జి. సుకన్య వాలంటీర్లను, వృక్షశాస్త్ర విభాగాన్ని అభినందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం నివసిస్తున్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం సంతోషంగా రోగాలు లేకుండా జీవించడం కుదురుతుందన్నారు.లేనిపక్షంలో అనేక వ్యాధులకు గురికావాల్సి వస్తుందన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు తమ వంతుగా పాల్గొని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.


మొక్కలు నాటుతున్న అధ్యాపక, విద్యార్థి బృందం

వృక్షశాస్త్ర విభాగాధిపతి డా.నర్మద మాట్లాడుతూ విచ్చలవిడిగా పెరిగిపోతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి మొక్కలు నాటి వాటిని సంరక్షించడమే ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గార్డెన్ సమన్వయకర్తడా.బి.సదాశివయ్య,అధ్యాపకురాలు లత,వాలంటీర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలి

**సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి బి.రాము**

**నారాయణపేట టౌన్,ఆగష్టు 08 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలుకై కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము అన్నారు.గురువారం సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా, పాత బస్టాండ్ మీదుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాకు సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కాశినాథ్ అధ్యక్షత వహించగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 7 నెలలు కావస్తున్నా హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రుణమాఫీని కూడా హామీ ఇచ్చిన ప్రకారంగా ఆగస్టు 15 లోపు రూ.2 లక్షలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని, తప్పులు పడిన వేలాది మంది రైతుల పేర్లను సరిచేసి వారికి బేషరతుగా రేషన్‌కార్డు ప్రాతిపదికన లేకుండా రుణమాఫీఎన్నికల ప్రచారంలో ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ప్రతినిధిగా వచ్చిన తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు ఎం.సలీం, బి.యాదగిరి, జయలక్ష్మి, రాము, బి.నరసింహ, నరసింహులు, డివిజన్ ప్రశాంత్, భగవంతు, చెన్నారెడ్డి, నారాయణ, హాజీ మలాంగ్ బాలకృష్ణ, నరసింహ,కృష్ణయ్య, చెన్నప్ప, రామాంజనేయులు, వెంకట్‌రాములు, సునిత, కెంచ నారాయణ,అంజి, సాదిక్,సలీం, తాయర్‌సాయి, భాస్కర్, ఆజాద్, వెంకటేష్,బాలు,లక్ష్మమ్మ, ఆశబి, నర్మద, వెంకటమ్మ, చాంద్‌బితో పాటు తదితరులున్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సిపిఐ (ఎంఎల్) నాయకులు

# బుద్ధారం గండినీ టూరిజం హబ్‌గా మార్చుకుందాం!

**● ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుకు సర్వేలు పూర్తి ● వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**గోపాలపేట ఆగష్టు 8 ప్రభాతవార్త:** రానున్న కాలంలో గోపాల్‌పేట మండలం బుద్ధారం గండి ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మార్చుకుందామని ఇప్పటికే బుద్ధారం గండిలో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటు కోసం భూసర్వే పూర్తయిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం గండి ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం కమిటీ సభ్యులకు శాలువాలు పూలమాలలతో సన్మానంచేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గండి ఆంజనేయ స్వామి ఆలయం రానున్న కాలంలో టూరిజం హబ్‌గా మారబోతుందని అందుకు పర్యాటక శాఖ నుంచి ఇప్పటికే రెండు కోట్ల రూపాయకు ప్రతిపాదనలు త్వరలోనే హరిత హోటల్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేని వేదమంత్రాలతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో గోపాల్‌పేట , రేవల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మంద సత్యశీల రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.


గండి ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులకు శాలువతో సన్మానం చేసిన దృశ్యం

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా వైద్యాధికారి స్వరాజ్యలక్ష్మి**


మొక్కలు నాటుతున్న జిల్లా వైద్యాధికారి స్వరాజ్యలక్ష్మి

**వెల్దండ, ఆగస్టు 08 ప్రభాతవార్త:** సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి స్వరాజ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంతో పాటు సబ్ సెంటర్‌ను జిల్లా వైద్యాధికారి స్వరాజ్యలక్ష్మి పరిశీలించారు. సబ్ సెంటర్‌లో భాగంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లావైద్యాధికారి స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రతి రోజు ఫీవర్ సర్వే నిర్వహించాలని, డ్రైడే కార్యక్రమం క్రమం తప్పకుండా పాటించాలన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఎ భీమానాయక్, ఎంపీఓ రేణయ్య,మెడికల్ అఫీసర్‌మంజూ భార్గవి,డాక్టర్ నర్సింహ్మదేవ్, సీహెచ్ఓ శ్రీనివాసులు,పర్వతాలు,మురళి,మనోజ్, లక్ష్మణ్,గోవర్ధన్, మధు, ఎల్‌టీ. శ్రీను,ఏఎన్ఎం జహంగీర్‌బీ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ దాడులు



**వెల్దండ, ఆగస్టు08 ప్రభాత వార్త:** ఎక్సైజ్ సర్కిల్ కల్వ కుర్తి పరిధిలో నాటు సారా తయారీ స్థావరాలు, రవాణా దారులపై గురు వారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. మండలంలోని పెద్దాపూర్, తుంకిబండతాండ, రాచూర్ తండాల్లో జరిపిన దాడుల్లో 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి రాచూర్ తాండ నుంచి యంగంపల్లి గ్రామానికి 180 లీటర్ల నాటుసారాను బైక్‌పై తరలిస్తున్న బాలరాజును అదుపులోకి తీసుకొని బైక్ స్వాధీన పర్చుకు న్నట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.నాటుసారా తయారు చేసిన విక్రయించిన కేసులునమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ దాడుల్లో సిబ్బంది నజీర్, రఘు,మహేష్, కృష్ణ, పరుశరాం ఉన్నారు.

## తపాల శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- పోస్టల్ సబ్ డివిజన్ పర్యవేక్షణ అధికారి రవికుమార్**



మాట్లాడుతున్న పోస్టల్ సబ్ డివిజన్ పర్యవేక్షణ అధికారి రవికుమార్

**కల్వకుర్తి, ఆగస్టు 08 ప్రభాతవార్త:** తపాల శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సబ్ డివిజన్ పర్యవేక్షణ అధికారి రవికుమార్ అన్నారు. కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామంలో తపాల శాఖ ప్రవేశ పెట్టిన పథకాల గురించి గ్రామ ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాల శాఖ గ్రామ ప్రజల కొరకు అందిస్తున్న చిన్న మొత్తాల పొదుపు, రికరింగ్ డిపాజిట్, సేవింగ్ అకౌంట్స్, టైమ్ డిపాజిట్‌లలో చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టి అధిక మొత్తంలో వడ్డీ అందిస్తుందని తెలిపారు.గ్రామీణ ప్రజల కొరకు గ్రామీణ తపాల భీమా పథకం పొందవచ్చు, తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ పొందవచ్చునన్నారు.ఇండియా పోస్ట్‌పేమెంట్ బ్యాంక్ ద్వారా జనరల్ ఇన్సూరెన్స్ సంవత్సరానికి రూ.520లు చెల్లించి రూ.10లక్షల భీమా పొందవచ్చునన్నారు. గ్రామంలో ఉన్న అన్ని పోస్ట్ అఫీస్‌లలో ఈ పథకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కల్వకుర్తి సబ్ పోస్ట్ మాస్టర్ శివాజీ, రాజు, బ్రాంచ్, పోస్ట్ మాస్టర్ సంధ్య, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కలెక్టర్



**ఉట్కూర్,ఆగస్టు 08 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో గురువారం పాతపేట హనుమాన్ దేవాలయంలో జరిగిన వివాహ వేడుకలలో తన వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్న సిబ్బంది తమ్ముడి వివాహానికి జిల్లా కలెక్టర్ హాజరై నూతన దంపతులైన అశోక్ లావణ్యలను పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముద్దం రాము, మల్లెపల్లి అశోక్, చందాపురం రవి నూతన దంపతులను ఆశీర్వదించారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తా

**-కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్**


కాలనీల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్

**కల్వకుర్తి, ఆగస్టు 08 ప్రభాతవార్త:** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కల్వకుర్తి మున్సిపాలిటి అభివృద్ధికి పాటు పడుతానని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు అంతర్గత రహదారులు డ్రైనేజీ వ్యవస్థ పటిష్టం చేసేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని 7వ వార్డులో కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులుతో, వార్డు సభ్యులతో కలిసి కలిసి బృంగి ఆనంద్‌కుమార్ పర్యటించారు. 7వ వార్డులో ప్రజా సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు.ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి సహకారంతో మంజూరైన సీసీ రోడ్లను త్వరితగతిన నిర్మాణానికి చేపట్టాల్సిన అంశాలను ఆయన చర్చించారు.కాలనీల్లో సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌శ్రీకాంత్‌రెడ్డి, మబ్బు సాయిలు, నాయకులు దున్నసురేష్, దొడ్డిరవి, వెంకటేష్, ఆనంద్,చందు, రాకేష్, నరేందర్, రాము, పవన్, రియాజ్, సుబ్బు, షమీమ్, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

## తెలంగాణ అమరవీరులను ఎల్లప్పుడు స్మరించుకోవాలి

**-మున్సిపల్ కమిషనర్ దశరథం**



**గద్వాల,ఆగస్టు 8,ప్రభాతవార్త:** తెలంగాణ అమరవీరులతో పాటు స్వాతంత్ర సమరయోధులను ఎల్లప్పుడు స్మృతి స్మరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ దశరథం అన్నారు.పే స్మృతి వనంలో స్వాతంత్ర సమరయోధులు తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి జ్ఞాపకార్థం మొక్కలు నాటే కార్యక్రమం సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు .స్మృతి వనంలో మొక్కలు నాటే కార్యక్రమంలో మున్సిపాల్ కమిషనర్ దశరథ్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ సభ్యులు,1969 తెలంగాణ ఉద్యమకారుల సంగం అధ్యక్షులు మోహన్ రావు, అచ్చున్నగౌడ్,1969 ఉద్యమకారుడుప్రభాకర్ బాబు రెడ్డి,రంగన్న హనమంతు,మహిళా నాయకురాలు కే.మాధవి,కే.అరుణ ,పటేల్ సంధ్యరెడ్డి,జ్యోతి,పద్మ,సరస్వతి,అలివేలమ్మ,కామ్‌లే,మాధవి శెట్టి, ఇంజనీర్ మురళి,జిల్లా వికలాంగులు అధ్యక్షులు టెంకాయల చంటి, ఈశ్వరి రెడ్డి,వైండింగ్ రాములు,రమేష్ గౌడ్ నారాయణరావు,పిఇటీ ప్రభాకర్,గట్టు విజయ్‌సాధతుల్లా, వినోద్ చారి,బ్యాంక్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

## యువకుడికి 10 సంవత్సరాలు జైలు శిక్ష

**కొత్తకోట ఆగష్టు8 ప్రభాతవార్త:** కొత్తకోట మండల పరిధిలోని గల పాలెం గ్రామం చెందిన చింతకాయల లక్ష్మీ నారాయణకు పది సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష లక్ష అయిదు వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. గరువారం అందుకు సంబంధించిన వివరాలు ఎస్సై వివరించారు. పాలెం గ్రామానికి చెందిన చింతకాయల లక్ష్మీ నారాయణ పై 2018 అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి మోసం చేశాడని అప్పటి ఎస్సై రవికాంత్ రావు సీఐ సోమ్ నారాయణ సింగ్ కేసు నమోదు చేశారని తెలిపారు. ప్రస్తుత వనపర్తి డి.ఎస్.పి వెంకటేశ్వరరావు ఫైనల్ చార్జిషీట్లు చేశారని కొత్తకోట ఎస్సై మంజునాథ్ రెడ్డి,కోర్టు కానిస్టేబుల్ తిరుపతయ్య, శ్రీనివాసులు కలిసి పీపీ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సాక్షులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ జిల్లా జడ్జి ఎం.ఆర్ సునీత పూర్వపరాలు పరిశీలించి నిందితుని గుర్తించి శిక్ష ఖరారు చేశారని మోసపోయిన యువతికి 90 వేల రూపాయలు నష్టపరిహారం అందించేందుకు కోర్టు ఆదేశాలు అందినట్లు ఎస్సైతెలిపారు. ఈ సందర్భంగా కోర్టు కానిస్టేబుల్‌ను ఎస్సై అభినందించారు.

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలి



**పాన్‌గల్ ఆగష్టు 8 ప్రభాతవార్త:** వర్షాకాల ప్రభావంగా ప్రతి విద్యార్థి ఈ సీజన్‌లో వ్యాపించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అలాగే పరిశుభ్రతను పాటించాలని మండల ప్రాథమిక వైద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినిలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు పరిశుభ్రతను పాటిస్తూ సీజనల్ వ్యాధులు కలరా, మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతను పాటించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ బి ఎస్ కే వైద్యాధికారి ఫార్మసిస్ట్ స్వప్న ,కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ హేమలత ,ఏఎన్ఎం చెన్నమ్మ, హెల్త్ అసిస్టెంట్ లు రామ్ చందర్ ,మదన్ గోపాల్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

## జిపి సిబ్బందికి ఐడెంటి బీమా కార్డుల పంపిణీ

**తెల్కపల్లి,ఆగస్టు 08 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో తెల్కపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని అన్ని గ్రామాలలో మంచినీటి వాటర్ పైప్‌లైన్ లీకేజీ కాకుండా చూసే విధంగా, మురికి గుంటల దగ్గర ఆయిల్ బాల్ వాట్ ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ ఇలాంటి కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికులకు ఐడెంటి కార్డులు,పది లక్షల లైఫ్ ఇన్సూరెన్స్ బాండ్‌లను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేముల భాస్కర్, గ్రామ పంచాయతీ సిబ్బంది కార్మికులు పాల్గొన్నారు.


కార్మికులకు ఐడెంటి కార్డులు, బీమా పాలసీలు అందజేస్తున్న డిపిఓ కృష్ణ

## ఒకేచోట ఆరు పాములు

### విషరహిత సర్పాలుగా గుర్తించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సదాశివయ్య



ఒకేచోట గుర్తించిన ఆరు పాములు

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగష్టు08 ప్రభాతవార్త:** జడ్చర్ల మండలం ఉదండా పూర్ గ్రామంలో మేస్త్రీ సోమయ్య ఇంట్లో గురువారం పునాది దగ్గర ఒక పాము కనిపించింది. అప్రమత్తమైన ఆయన వెంటనే సర్ప రక్షకుడు డా. సదాశివయ్యకు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న సదాశివయ్య తన శిష్యులు రాహుల్, చంద్రశేఖర్‌లతో అక్కడికిచేరుకుని ఆపామును పట్టుకోగా అదే రంధ్రంలో నుండి మరో పాము రావటం గమనించారు. కొంచెం తవ్వి చూడగా ఒకేచోట 6 పాములున్నాయి. వాటిని చాకచక్యంగా సంరక్షించారు.ఈ విషయం గురించి డా. సదాశివయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కువశాతం నీరు బహిరంగ ప్రదేశా ల్లోని రంధ్రాలలోకి పోవడం వల్లపాములు బయటికి వచ్చి మానవ నివాస ప్రాంతాల్లో ఉంటాయన్నారు. ఆ ఇంట్లో పట్టుకున్న పాములను శాస్త్రీయంగా అంఫియస్మా స్టోలేటమ్ అంటారని ఇవి విషరహితసర్పాలని తెలిపారు. ప్రజలుపాములు కనబడినప్పుడు భయభ్రాంతులకు గురి కాకుండా తమకు తెలియ జేయాలని సూచించారు. ఈ రకం పాములు గుంపులు గుంపులుగా ఉండడం సహజమని అన్నారు.అన్ని పాములను పట్టుకోవడంతో సోమయ్య కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

### చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్తూ

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



**నారాయణపేట టౌన్,ఆగష్టు 08 ప్రభాతవార్త:** చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన నారాయణపేట జిల్లాలో చోటు చేసుకుంది. అందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలం ఎర్గడ్‌పల్లి గ్రామానికి చెందిన సుజాతకు గత మూడు రోజుల కిందట పాముకాటు వేసింది. చికిత్స పొంది మరోసారి జిల్లా ఆసుపత్రిలో చూసుకునేందుకు తాజాగా గురువారం వాళ్లకు సంబంధించిన అభినయ్ (24) ద్విచక్ర వాహనంపై ఇరువురు కలిసి జిల్లా ఆసుపత్రికి వస్తుండగా పేట మండలం సింగారంగేట్ మక్తల్ వెళ్లే రోడ్డు పక్కన ఉన్న కాడెద్దులు అడ్డు రావడంతో తప్పించబోయి అదుపుతప్పి కిందపడి అక్కడి కక్కడే అభినయ్ మృతి చెందగా సుజాతకు తీవ్ర గాయాలయ్యాయి. పక్కనున్న కొందరు 108 కాల్ చేసి అంబులెన్స్ చికిత్సల నిమిత్తం పేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేస్తున్నారు.

## భూత్పూర్ మున్సిపాలిటీలో స్వచ్ఛదనం..పచ్చదనం

**భూత్పూర్,ఆగష్టు 8,ప్రభాతవార్త:** స్వచ్ఛదనం..పచ్చదనం పేరిట జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న పరిశుభ్రతా చర్యల్లో భాగంగా భూత్పూర్ మున్సిపాలిటీలోని నాల్గోవార్డులో పట్టణ మున్సిపాలిటీ గురువారం డ్రైనేజీ పరిశుభ్రతా చర్యలు చేపట్టింది.వార్డు కౌన్సిలర్ నాగమ్మ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ వార్డు ఆఫీసర్ సుజాత దగ్గరుండి జేసీబీతో రోడ్డు పనులు చేయించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు గడ్డం యాదయ్య,ఆర్పీ వసంత,ఆశ వర్కర్ యాదమ్మతో పాటు ఇతర మున్సిపల్ సిబ్బంధి పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

**జడ్చర్ల,ఆగష్టు 08 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీలోని వల్లభాయ్ పటేల్ నగర్ వద్ద జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ తెలుగు మీడియం విద్యార్థులకు వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో 200 నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో గురువారం రీజియన్ ఛైర్మన్ అఫిషియల్ విజిట్ ప్రోగ్రాం నిర్వహించారు. జిల్లా ప్రజా పరిషత్ తెలుగు మీడియం స్కూల్లో హెచ్ఎం లక్ష్మి, రామచంద్రారెడ్డి, ఇంఛార్జి కృష్ణ, అంజయ్య, ప్రోగ్రాం రీజియన్ ఛైర్మన్ కందే కృష్ణ, రీజియన్ సెక్రటరీ గోటూరు వెంకటేష్, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ లగిశెట్టి చంద్రశేఖర్, అల్లంపల్లి ప్రదీప్, ట్రెజరర్ పెరుమాళ్ళ రాఘవేంద్ర గుప్తా, బూరుగు శ్రీధర్, బారం రాఘవేందర్, కల్వ రాఘవేందర్, కూన నరేష్, వాసవి, వనిత క్లబ్ ప్రెసిడెంట్ బి. రజిత, సెక్రెటరీ ఆలంపల్లి సాయిలీల, మిగతా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## భూగోళం మనుగడ, నీటిపైనే ఆధారపడి ఉంది



ఇంకుడు గుంతలపై అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక అధికారి

**బిజినేపల్లి,ఆగష్టు 08 ప్రభాతవార్త :** భూగర్భ జలాల పరిరక్షణ అందరి బాధ్యత అని జీవరాశి, భూగోళం మనుగడ, నీటిపైనే ఆధారపడి ఉందని భూగర్బ జల శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి రమాదేవి అన్నారు. నంది వడ్డేమాన్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు భూగర్బ జలాలపై అవగాహన కల్పించారు. నీటి ప్రాముఖ్యత, పొదుపు గురించి వివరించారు. జలాలు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నీటిని అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. 2040 నాటికి ప్రపంచంలోభూగర్భ జలాలుచాలావరకు తగ్గిపోయే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న తరుణంలో జలాలను సక్రమంగా వినియోగించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. నానాటికి పెరుగుతున్న నీటి కొరత అధిగమించేందుకు ప్రభుత్వంతో పాటు యువత,విద్యార్థులు దేశంలో నీటి కొరత పెరుగుతోందని, బెంగుళూరు, చెన్నై వంటి పట్టణాలే ఉదాహరణ అని ప్రజలకు తెలియజెప్పాలన్నారు. భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నీటి ప్రాధాన్యతను, సంరక్షణ బాధ్యతని విద్యార్థులకు తెలియజేశారు. పర్యావరణాన్ని కాలుషితం కాకుండా చూడడం, మొక్కలు నాటడం, నీటివనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు నీరు అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఇంకుడు గుంతలు, రిజర్వాయర్లు, చెరువుల ద్వారా నీటిని సంరక్షించే విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కథలప్ప, హెచ్ఎం హనుమంత్‌రెడ్డి, ఈజిఎస్ ఎపిఓ మల్లికార్జున్,పంచాయతీ సెక్రెటరీ లింగారెడ్డి, ఏఎన్ఎం వెంకటమ్మ పాల్గొన్నారు.

## ఆకాశవాణిలో మధుసూదనశర్మ ప్రసంగాలు

**కొల్లాపూర్,ఆగష్టు 08 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎన్మన్‌బెట్ల గ్రామానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, తెలుగు భాషోపాధ్యాయులు, తెలుగు భారతి సంస్థ ప్రధాన కార్యదర్శి వేదార్థం మధుసూదనశర్మ చేసిన ప్రసంగాలు ఆగష్టు నెల 9,16,23,30 తేదీలలో ఉదయం 6 గం.ల 10 ని.లకు ఆకాశవాణి హైదరాబాద్ ఏ కేంద్రం ద్వారా ప్రసారం అవుతాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీన త్యాగం, 16వతేదీ ఐశ్వర్యం, 23వ తేదీన స్ఫూర్తి, 30వ తేదీన లక్ష్యం అనే అంశాలపై తన లఘు ప్రసంగాలు ప్రసారం అవుతాయని ఆయన తెలిపారు. తెలుగు సాహితీ రంగంలో లబ్ద ప్రతిష్టులైన మహాకవుల గురించే కాకుండా ప్రముఖ రచయితలు చేసిన రచనలపై, అలాగే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు, భారత రాజ్యాంగం నిర్మాణం, ప్రపంచ జ్ఞాన క్షేత్రంగా భారత్, జటప్రోలు సంస్థానం సాహిత్య సేవ మొదలైన పలు అంశాలపై గతంలో తాను అనేక ప్రసంగాలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తనకు ఈ విధంగా అవకాశం కల్పిస్తున్న ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం అధికారులకు, సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# వీధి కుక్కల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

### ●వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి





జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి ఆగష్టు8 ప్రభాతవార్త:** వీధి కుక్కల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం వనపర్తి పట్టణంలోని నాగవరం శివారు ఉరగుట్ట వద్ద కొత్తగా నిర్మితమైన జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ తో కలిసి పరిశీలించారు. జిల్లాలో వీధి కుక్కల సంతతిని తగ్గించడానికి రోజుకు కనీసం 10కుక్కలకు జనన నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని నలుమూలల నుండి వీధి కుక్కలను తీసుకు వచ్చి సురక్షితమైన పద్ధతిలో శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ఎనిమల్ వెల్ఫర్ కేర్ సెంటర్ ఏజెన్సీతో ఒప్పందం చేసుకోవడం జరిగింది. శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు అవసరమైన సదుపాయాలు, సిబ్బందిని సమకూర్చుకోవాలని మున్సిపల్ కమిషనర్,జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని సూచించారు.శస్త్ర చికిత్స అనంతరం వారం రోజులు అక్కడే వాటి ఆరోగ్య సంరక్షణ చేసే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. శస్త్ర చికిత్సలు ప్రారంభించాలని సూచించారు. డంపింగ్ యార్డులో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.. సెగ్రిగేషన్ షెడ్‌ను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ప్లాస్టిక్ ను అమ్మేయడంతో పాటు తడి చెత్త నుండి సేంద్రియ ఎరువులు తయారు చేయాలని సూచించారు. మున్సిపాలిటీ నుండి రోజుకు ఉత్పత్తి అయ్యే చెత్త ఎంత, ఎన్ని క్వింటాళ్ల చెత్తను సేకరిస్తున్నారు అనే పూర్తి వివరాలు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా బయో మైనింగ్‌ను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జెడ్పి సీఈఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధకారి వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది

### ముగిసిన నవోదయ క్రీడా సమ్మేళనం



గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న అధికారులు

**బిజినపల్లి,ఆగష్టు 08 ప్రభాతవార్త:** పిల్లలతో కొత్త పరిచయాలు ఏర్పడి స్నేహభావం పెరుగుతుందని భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఎల్లన్న అన్నారు. వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం తెలంగాణా క్లస్టర్ స్థాయి క్రీడా సమ్మేళనం ముగిసింది. ముగింపు సమావేశంలో బ్యాంక్ మేనేజర్ ఎల్లన్న మాట్లాడుతూ నాలుగు గోడల మధ్య కంప్యూటర్ మనుషుల్లా తయారవుతున్న విద్యార్థులకు ఈ క్రీడలు ఎంతో ముఖ్యమైనవని అన్నారు. ప్రిన్సిపల్ భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ చదువుతోపాటు విద్యాలయ విద్యార్థులకు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. వివిధ ప్రాంతాల నుండి హాజరైన క్రీడాకారులతో కొత్త పరిచయాలు ఏర్పడి వారి వారి ఆహారపు అలవాట్లు ఆ ప్రాంతాల గొప్పతనాన్ని తెలుసుకోగలుగుతారన్నారు. తెలంగాణ జిల్లాల నవోదయ విద్యాలయాల నుండి ప్రత్యేక న్యాయనిర్ణేతలు రెండు రోజుల ఎంపిక అనంతరం ఉత్తమ బాస్కెట్ బాల్, హ్యాండ్‌బాల్, వాలీబాల్ క్రీడాకారులను రీజనల్ స్థాయి పోటీలు ఎంపిక చేశారు. ఉత్తమ క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు ప్రధానం చేశారు. విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో విద్యాలయ వ్యాయామ అధ్యాపకులు బి.సత్యజ్యోతి, పర్వేష్, మదన్‌భాస్కంచారి, నవోదయ పాఠశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**అడ్డాకుల,ఆగష్టు 08 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బృహత్తర కార్యక్రమం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నాలుగోరోజు సీజన్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమంలో గురువారం నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు, మండల నాయకులు గ్రామ ప్రజలతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న వివిధ రకాలైన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల తహసిల్దార్ మదన్‌మోహన్‌గౌడ్,ఎంపిడిఓ శ్రీనివాసులు,స్పెషల్ ఆఫీసర్ డిఎఫ్ఓ మండల పంచాయతీఅధికారి ఎంఈఓ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వైద్యాధికారులు, మండల అధికారులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడి టీచర్లు, మహిళా సంఘాలు జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు నాగిరెడ్డి, గంగుల విజయమోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు తోట శ్రీహరి, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్‌లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మీసేవ సెంటర్ లోకేషన్ మార్పు కోసం అభిప్రాయ సేకరణ

### మీసేవ సెంటర్లను తనిఖీ చేసిన జిల్లా పర్యవేక్షణ అధికారి



**గోపాల్ పేట ఆగష్టు8 ప్రభాతవార్త:** గోపాల్‌పేట మండల కేంద్రంలో మొత్తం 4 మీసేవ కేంద్రాలు ఒక ఆధార్ సెంటర్ ఉన్నాయి. వనపర్తి జిల్లా డిస్టిక్ మేనేజర్ విజయకుమార్ ఒక మీ సేవ సెంటర్ లోకేషనల్ మార్పిడి కోసం పర్యవేక్షించడానికి గురువారం ఉదయం మండల కేంద్రానికి వచ్చారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఒక సెంటర్ నుండి వెరొక సెంటర్ కి 500 మీటర్స్ ఉండాలి, లేని యెడల 500 మీటర్స్ లో ఉన్న మిగతా సెంటర్లా నుండి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలి. మండల కేంద్రంలోని మీసేవల దగ్గరకు వెళ్లి పర్యవేక్షించాల్సిన అధికారి, అభిప్రాయ సేకరణ కోసం వచ్చానని చెప్పి వెళ్లారు. మండల కేంద్రంలో ఉన్న హనుమాన్ మీసేవ సెంటర్ లోకేషన్ మార్చరు దానికి గాను మండల కేంద్రంలో ఉన్న మిగత సెంటర్స్ నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వవలసి ఉంటుందని కానీ అందులో సెంటర్ మార్చిన దానికి దగ్గర గల సెంటర్ ఓనర్ ప్రభుత్వ నిబంధన ప్రకారం అనుమతి ఇవ్వాలి అని తెలిపారు. ఇడిఎం విజయ్ కుమార్ సెంటర్ దగ్గరికి వెళ్లి మీ అభిప్రాయం ఏంటని అడగగా, సెంటర్ ఓనర్ మీకు గతంలోనే రాతపూర్వకంగా ఇచ్చాం, ఆయన మీసేవ కమిషనర్ హైదరాబాద్ ఇఎస్టిలోని అడ్మిన్ విజయ భాస్కర్ గౌడ్ (డిడి అడ్మిన్) ఎలాంటి ఎన్‌ఓసి లేకుండా చేస్తాం అని సదరు మీసేవ అతనిని బెదిరిస్తున్నారు అని తెలిపారు. అధికారిని ఒక విలేకరి ప్రశ్నించగా ఎలాంటి సమాధానం లేకుండా జరుకున్నాడు.

## మంత్రి జూపల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం



**చిన్నంబావి,ఆగష్టు 08 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దమరూర్ పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటానికి గ్రామ ప్రజలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి మంత్రి జూపల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ, సింగిల్ విండో ఛైర్మన్ బంగారి నరసింహారెడ్డి, వైస్ ఛైర్మన్ బిళ్లకంటి విద్యాసాగర్‌రావు పాల్గొని క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలలో సమావేశం నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ జూపల్లి బాల్యదశలో తాను చదువుకున్న పెద్ద మరూర్ గ్రామ పాఠశాల అభివృద్ధి కొరకు ప్రత్యేక చొరవ చూపి తమ సొంత నిధులు మంజూరు చేసి పాఠశాల అభివృద్ధికి దోహదపడడం అభినందనీయమని, త్వరలోనే మంజూరు చేసిన పనులను పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉషనయ్య,ప్రైమరీ, హైస్కూల్‌ప్రధానోపాధ్యాయురాలు జి.రమణమ్మ, ఎ.అలివేలు, ఉపాధ్యాయులు భరత్‌కుమార్, గణేష్,రాముడు, శ్యామల, హుసేన్, బి.శివలీల,శబానా, గ్రామ నాయకులు హనుమంతురావు, భీముడు,వెంకటేశ్వరరావు, నారాయణరావు,శివ, నరేష్‌యాదవ్, సురేష్, రత్నగిరి ఫౌండేషన్ సభ్యులు సురేష్, సాయిచరణ్‌లు ఉన్నారు.

## ఘనంగా పండుగ సాయన్న జయంతి

**మక్తల్ టౌన్,ఆగష్టు 08 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బిందల్‌కుంట గ్రామంలో పండగ సాయన్న జయంతి వేడుకలు బిసి సేన నారాయణపేట జిల్లా అధ్యక్షులు సేలేటి వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పండగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిసి సేన జిల్లా అధ్యక్షులు సేలేటి వెంకటేష్ మాట్లాడుతూ పండగ సాయన్న అత్యంత ధీరునిగా సాహసవంతునిగా ఎదిగిన సాయన్న చిన్ననాటి నుంచి అన్యాయాలను ఎదిరించి పేదల పక్షాన నిలబడ్డాడని అన్నారు. నీరటి వెంకటేష్, భైరంకొండ వెంకటయ్య, బొడ్డాయి నర్సింలు, పెద్ద ఆంజనేయులు, కె. నర్సింలు, గుర్రం వెంకటయ్య, గుడిసె నరసింహులు, పెద్ద కథలప్ప పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ

**బిజినేపల్లి,ఆగష్టు 08 ప్రభాతవార్త :** రైతు రుణమాఫీ అనేది రైతులకు పండగ లాంటిదని, అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ జరుగుతుందని తహసిల్దార్ శ్రీరాములు అన్నారు. మండల వ్యవసాయ కార్యాలయంలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ ఏఈఓలను సన్మానించారు. తహసిల్దార్ మాట్లాడుతూ రైతులకు రుణభారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందని అన్నారు. రైతులు రుణమాఫీ కాలేదని అధైర్యపడవద్దని అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అండగా ఉండి సలహాలు అందించి రుణమాఫీ పథకంలో అర్హత కలిగిన ప్రతి రైతులబ్ధిపొందేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి నీతిరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోడానికి వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఈఓలు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

**ఉట్కూర్,ఆగష్టు 08 ప్రభాతవార్త:** ఉట్కూర్ గ్రామంలో ఆరోగ్యకేంద్రం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. చుట్టుపక్కల ఇండ్లను సందర్శించి సీజనల్ డిసీజ్ గురించి, వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి, ఫ్రైడే డ్రైడేను పకడ్బందీగా ఏ విధంగా నిర్వహించాలి,దోమకాటు నుండిమనం ఏ విధంగా రక్షించుకోవాలని ఈ విషయాలపై అవగాహన కల్పించారు. ఎస్సీ హాస్టల్‌లోని గదులను ఏసీఎం కెమికల్‌తో ఇండోర్ స్ప్రే చేశారు. కార్యక్రమంలో డా.భవాని, ఆరోగ్య విస్తరణాధికారి విజయ్‌కుమార్,పర్యవేక్షకులు నరసింహులు, గ్రామ సెక్రెటరీ శ్రీనివాసరావు,హాస్టల్ వార్డెన్‌జగదీశ్వర్‌రెడ్డి, రాపిడ్ రెస్పాన్స్ టీం సభ్యులు శంకర్, బుగ్గేశ్వర్, చంద్రశేఖర్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.





## కోనోకార్పస్ మొక్కలు హానికరం..

### - వార్డులో చెట్లను తొలగింపజేసిన కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి



**జడ్చర్ల, ఆగస్టు8, ప్రభాతవార్త:** కోనోకార్పస్ మొక్కలు పర్యావరణానికి హానికరమని కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో మున్సిపల్ సిబ్బందితో కలిసి కోనోకార్పస్ మొక్కలను తొలగింపజేశారు. ఈ మొక్కల వల్ల శ్వాసకోశ సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యలు తలుత్తుతున్నాయని అందుకే కోనోకర్పాసన్ చెట్లను తొలగించినట్లు తెలిపారు. వాటి స్థానంలో ఇతర మొక్కలను నాటనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కాలనీలోని రోడ్లకుఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించారు. కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉన్న చోట్ల ఆయిల్‌బాల్స్ త్రో చేశారు. దోమల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా పారిశుధ్య సమస్యలు తలెత్తితే మున్సిపల్ సిబ్బందికి తనకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, వంశీ,వెంకటేష్, వేణు, శేఖర్,మల్లేష్ గౌడ్, గోనెల రాధాకృష్ణ, ఆశా వర్కర్ అంజిబాబు పాల్గొన్నారు.

## ఆరుబయట పాఠాలు..

(మొదటి పేజీ తరువాయి)

పోతున్నాయి.పాఠశాలలో ఎటు చేసినా ఊడిన పెచ్చులతో పాటు ఇనుప చువ్వలు బయటకు తేలిన భయంకరమైన దృశ్యాలు సర్కారు పాఠశాలలో దర్శనమిస్తున్నాయి. గతవారం రోజుల నుంచి భారీగా వర్షాలు కురవడంతో గోడలన్ని పూర్తిగా తడిచిపోయి ప్రమాదరకంగా మారాయి. పాఠశాలో ఎప్పుడు ఏం జరుగుతుందో అని అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు ఉపాధ్యాయులు ముందస్తు చర్యలో భాగంగా విద్యార్థులకు చెట్లకింద పాఠాలు బోధిస్తున్నారు.వరండాలో ఒక తరగతి, చెట్టు కిందమరో రెండు తరగతులను నిర్వహిస్తున్నారు. రానున్న రోజుల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే ప్రభుత్వం మేలుకొని శిథిలావస్థలో ఉన్న భవనాన్ని పూర్తిగా తొలగించి నూతన భవనాన్ని నిర్మించి ఆదుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## మాట తప్పని మడమ తిప్పని కాంగ్రెస్ ప్రభుత్వం

### హైకోర్టు అడ్వకేట్, గూడెం గ్రామ మాజీ సర్పంచ్ మామిళ్లపల్లి చక్రవర్తి

**చిన్నంబావి,ఆగష్టు 08 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం కొనసాగుతుందని ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా, అమలుపరుస్తూ ప్రజల మన్ననలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్నాయని హైకోర్టు అడ్వకేట్, గూడెం గ్రామ మాజీ సర్పంచ్ మామిళ్లపల్లి చక్రవర్తి అన్నారు. గురువారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని, ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం, రూ 500లకే గ్యాస్ సిలిండర్, రైతుల రుణమాఫీ, ప్రభుత్వ ఉద్యోగులకు నెల మొదటిరోజే జీతాలు విడుదల చేయడం, పెన్షనర్లకు సకాలంలో పెన్షన్ డబ్బులు అందించడంతో పాటు గ్రామాల పరిశుభ్రత కోసం స్వచ్ఛదనం పచ్చదన కార్యక్రమానికి నిర్వహించడం ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని కొనియాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుండి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావులు జిల్లా అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి జూపల్లి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని మంత్రి సొంతమండలమైన చిన్నంబావి అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆయన అన్నారు.దేశంలో బిసి కులగణన కోసంకాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చి, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో డిమాండ్ చేయడం గొప్ప విషయమని, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికికాంగ్రెస్ నిరంతరంకృషిచేస్తుందని ఆయన అన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలి

**ఉప్పునుంతల,ఆగష్టు 08 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో ఉన్న వైద్య విధాన పరిషత్ పరిధిలోని 30 పడకల ఆసుపత్రిని గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా వైద్య అధికారిణి స్వరాజ్యలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన సేవలు అందించాలంటూ పలు సూచనలు, సలహాలు అందించారు. ఆసుపత్రిలోని ప్రసూతి గదితో పాటు ఆసుపత్రిలో ఉన్న ప్రతి గదిని ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు పెంచాలని, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్న మందుల నిల్వలను పరిశీలించారు. ఆసుపత్రి పెద్దదైనప్పటికి వైద్య సేవలు మెరుగ్గా ఉండాలని, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయకూడదని సమయపాలన పాటించి ఆసుపత్రిలో మెరుగైన సేవలందించాలని వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. జిల్లా వైద్యాధికారిణి డా. స్వరాజ్యలక్ష్మి, డిప్యూటి డిఎంహెచ్ఓ డా. తారాసింగ్, వైద్యఅధికారులు డా.బిక్కులాల్,డా.స్వప్న, ఫార్మాసిస్టు కుమారచారి, శ్రీనివాసులు, సిబ్బంది ఉపతి, రేణమ్మ, దేవి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా సాగుతున్న పచ్చదనం పనులు



**ఉప్పునుంతల,ఆగష్టు 08 ప్రభాతవార్త :** స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలో పరిశుభ్రత పనులు ముమ్మరంగా కొనసా గాయి. మండల కేంద్రమైన ఉప్పునుంతల ఆసుపత్రి ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. వన మహోత్సవానికి చెట్లకు పాదులు తీశారు. అదే విధంగా తాడూరు సబ్ సెంటర్‌ను డా. ఎంఎల్‌హెచ్ పి.రాజు సందర్శించారు. ఈసందర్భంగా సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ గ్రామంలో కలియ తిరిగారు. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్షపు నీటిని నిల్వ ఉంచుకోకుండాఎప్పటికప్పుడు పరిశుభ్రంగాఉంచుకోవాలని సూచిం చారు.ఉప్పునుంతల గ్రామ ప్రత్యేక అధికారి, స్థానిక ఎంపిడిఓ మోహన్‌లాల్, వైద్యాధికారులు డా.బిక్కులాల్, డా.స్వప్న,ఫార్మాసిస్టు కుమార చారి, డా.ఎంఎల్‌హెచ్‌పి రాజు,పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తాలూకా ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం అధ్యక్షుడు మేడమోని మల్లయ్య, వైద్య,పంచాయతీ,ఆశ,అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోప్లాపూర్‌లో తల్లిపాల వారోత్సవాలు

**భూత్పూర్,ఆగష్టు 8,ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపల్ పట్టణంలోని మూడో వార్డు గోప్లాపూర్‌లో నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవంలో భాగంగా పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి,మేనేజర్ శంకర్,మున్సిపల్ ఫ్లోర్ లీడర్,మూడో వార్డు కౌన్సిలర్ తూము శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు.బిడ్డకు తల్లి పాల ప్రాముఖ్యతను గురించి కమిషనర్ సురేందర్‌రెడ్డి వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు,ఆరోగ్య సిబ్బంధి పాల్గొన్నారు.

## శివస్వాముల మండల అధ్యక్షులుగా గంగాధర్

**కోయిల్‌కొండ,ఆగష్టు 08 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కనాయపల్లి గ్రామంలో వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శివస్వాముల గురుస్వామి అయిన శివకుమార్ ఆధ్వర్యంలో శివస్వాముల మండల సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి మండలంలోని శివస్వాములు అంతా హాజరయ్యారు. ఈ సమావేశంలో శివస్వాముల మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శివస్వాముల గౌరవ అధ్యక్షులుగా కానాయపల్లి శివకుమార్ గురుస్వామిని ఎన్నుకోగా, మండల శివస్వాముల మండల అధ్యక్షులుగా మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా మండల శివస్వాముల ప్రధాన కార్యదర్శిగా కోయిల్‌కొండకు చెందిన గురుస్వామి హోటల్ యాదయ్యను, ఉపాధ్యక్షులుగా భీమయ్య, రమేష్, సహాయ కార్యదర్శిగా నాగరాజు,కోశాధికారిగా పారుపల్లిరవికుమార్, ప్రచార కార్యదర్శిగా దమాయపల్లి సత్యం, కమిటి సలహాదారులుగా గార్లపాడు శేఖర్‌చారి, అభంగపట్నం రాంరెడ్డి, వెంకట్‌నాయక్, విజయలింగం, రామకమయ్య, కృష్ణయ్య, నర్సింలు, రాజు, కమిటి కార్యవర్గ సభ్యులుగా జి.వీరేష్, మల్లేష్‌గౌడ్, గోపాల్, కృష్ణ, మన్నెమయ్య, చెన్నయ్యగౌడ్ వీరితో పాటు మరికొంతమందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.